క్లుప్తంగా

వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు

శంషాబాద్: వన్యప్రాణులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి దినోత్సవంలో భాగంగా కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జీవవైవిధ్యంతోనే ప్రకృతి సమతుల్యంగా ఉంటుందన్నారు. వన్యప్రాణులను హరించివేస్తే ప్రకృతి అనర్థాలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాను ప్రకాష్, అధ్యాపకులు దుర్గాభవాని, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 1వ డివిజన్‌లోని శివసాయినగర్ కాలనీలో తడి, పొడి, హానికారక చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన యువకుడి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. తరచూ గొడవ పడుతూ భౌతికంగా దాడి చేయడంతో పాటు కుటుంబ సభ్యులను దూషించడాన్ని జీర్ణించుకోలేని యువకుడు ఓ వ్యక్తిపై దాడి చేశాడు. ఆ దాడిలో వ్యక్తి మరణించిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు సమాచారం మేరకు... సైఫ్(23) అర్బన్ క్లాంపు కంపెనీలో ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన జబి(19), పాసిన్ ఆలియాస్ సఫిరుద్దీన్(24) నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో సైఫ్ సోదరుడు సోయల్ ఇచ్చిన సమాచారంతో హర్షమాల్ సమీపంలోకి పోలీస్ టీం వెళ్లిందన్నారు. అప్పటికే నిందితులు సైఫ్ మెడ, ఛాతి, రిస్ట్‌పై గాయపరిచి పరారయ్యారని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. వారి దాడిలో తీవ్రంగా గాయపడిన సైఫ్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించామన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సైఫ్ మృతి చెందాడని ఇన్‌స్పెక్టర్ వివరించారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

'కేబుల్' వైర్ల తొలగింపు



మణికొండ క్వార్టర్స్ బస్‌స్టాప్ వద్ద తొలగిన వైర్లు

'సాక్షి' ఎఫెక్ట్

మణికొండ: విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించిన అధికారులు వాటిని ఎక్కడికక్కడ రోడ్లపై పడవేయటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని 'సాక్షి' దినపత్రిక గురువారం' కేబుల్స్‌ను తొలగించండి' అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ డీఈ శివసాయి విద్యుత్ కేబుల్‌లను తొలగించాలని, ప్రజలకు ఇబ్బందిగా ఉన్నాయని తెలుపుతూ విద్యుత్ శాఖ సీఎండీకి గత నెల 23వ తేదీననే లేఖ రాశామని తెలిపారు. విద్యుత్ శాఖ డీఈ రమేష్ చంద్ర 'సాక్షి' కథనానికి స్పందించి వెంటనే మణికొండ క్వార్టర్స్ వద్ద ఉన్న కేబుల్ వైర్లను తొలగింప చేశారు. ఇదే తరహాలో మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న వైర్లను తొలగించాలని పలు కాలనీల వాసులు కోరుతున్నారు. ప్రజలు నడిచేందుకు, వాహనదారులకు ఇబ్బందిగా ఉన్న కేబుల్ వైర్లను తమ కథనంతో తొలగింపు చేసిన 'సాక్షి'కి మణికొండ క్వార్టర్స్ నివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

మణికొండ క్రికెట్ గ్రౌండ్‌కు.. హైటెక్ సొబగులు!

- రూ. 3 కోట్లతో అభివృద్ధి
- పూర్తి కావస్తున్న పనులు
- తీరనున్న క్రికెట్ క్రీడాకారుల వెతలు



మణికొండలో రానున్న క్రికెట్ గ్రౌండ్

మణికొండ: గండిపేట మండల పరిధిలో పలు రంగాల క్రీడాకారులు ఉన్నా వారికి సరైన సౌకర్యాలు లేక ఇప్పటి వరకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇతర క్రీడలకు అంతో ఇంతో ఆటస్థలాలు, ప్రైవేటు ఇండోర్ స్టేడియంలు ఉన్నా క్రికెట్ ఆడాలంటే మాత్రం దూరాభారాలను మోయాల్సిన పరిస్థితి ఉంది. మ్యాచ్‌లు ఆడాలంటే ప్రైవేటు గ్రౌండ్‌లకు వెళ్లి రూ. వేలు ఖర్చు చేయాల్సి రావటంతో ఎంతో మంది మిన్నకుంటున్నారు. అనుకూలమైన రోజుల్లో అవి లభించకపోవటం, ఖర్చు అధికం కావటంతో చేసేదేమి లేక వాటికి దూరమైన వారు ఎంతో మంది ఉన్నారు. మండల పరిధిలో క్రీడా అభిమానులను దృష్టిలో ఉంచుకుని 15 సంవత్సరాల క్రితం మంచిరేవులలో ఐదు ఎకరాల భూమిని కేటాయించటంతో పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత సదరు భూమి కోర్టు వివాదాల్లో ఇరుక్కోవటంతో అది అమలుకు నోచుకోకుండా పోయింది. అలాంటి క్రీడా అభిమానులందరినీ దృష్టిలో పెట్టుకుని మరోసారి మణికొండ మర్రిచెట్టు సమీపంలో, ల్యాంకో హిల్స్ పక్కన ఉన్న శ్మశానవాటికకు చెందిన ఏడు ఎకరాల భూమిలో 2.31 ఎకరాలు తీసుకుని క్రికెట్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేయాలని 2023లో నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా రూ. కోటి నిధులను కేటాయించి అందులో ఉన్న బండరాళ్లను తొలగించటం, లెవల్ చేసే పనులను ప్రారంభించారు.

'సాక్షి' కథనాలతో కదలిక...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇతర అభివృద్ధి పనులకు పెద్దపీట వేయటంతో పలు మార్లు స్టేడియం పనులను నిలిపివేశారు. ఆ విషయాన్ని 'సాక్షి' దినపత్రికలో ఇటీవల 'నిలిచిన స్టేడియం పనులు'.. 'నత్తనడకన స్టేడియం పనులు' అనే కథనాలను ప్రచురించింది. దాంతో స్పందించిన అప్పటి మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరో సారి పనుల్లో కదలిక తెచ్చారు. రూ. 50 లక్షలు, రూ. 45 లక్షలు, రూ. 40 లక్షలు చొప్పున రెండు సార్లు, రూ. 25 లక్షలు ఒక సారి, మొత్తం రూ. 3 కోట్లు కేటాయించటంతో ఎట్టకేలకు ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం సగం గ్రౌండ్ వరకు పచ్చిక బయళ్ల ఏర్పాటు పూర్తి కాగా మరి కొంత గ్రౌండ్ పనులు కొనసాగుతున్నాయి. క్రీడాకారులకు మూడు గదులు, క్రీడా అభిమానులు కూర్చుని ఆటను చూసేందుకు గ్యాలరీ పనులను పూర్తి చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం ముఖద్వారాన్ని తొలగించి మణికొండ క్రికెట్ గ్రౌండ్ పేరుతో హైటెక్ ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నారు. బాల్ బయటకు వెళ్లకుండా చుట్టూ పోల్స్ నాటి దానికి నెట్‌ను అమర్చారు.



క్రికెట్ గ్రౌండ్ ముఖ ద్వారం

నెల రోజుల్లో ప్రారంభిస్తాం



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వందకు పైగా మున్సిపాలిటీలలో లేని విధంగా మణికొండలో అన్ని వసతులతో క్రికెట్ గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నాం. ఇటీవలి భారీ వర్షాలు కారణంగా ఆయా పనులకు బ్రేక్ పడింది. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అవి నెలరోజుల్లోపే పూర్తి అవుతాయి. పూర్తికాగానే ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ శాఖ సీడీఎంఏ కమిషనర్ టి.కె. శ్రీదేవిలతో ప్రారంభింప చేస్తాం. అందులోనే వాకింగ్ ట్రాక్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్‌కు ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏ వారు ముందుకు వచ్చారు. వాటినీ ఏర్పాటు చేయిస్తాం.

– డి.ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ

మహిళలు ఆర్థికాభివృద్ధి దిశగా సాగాలి

జిల్లా అదనపు కలెక్టర్ కానూరి శ్రీనివాస్



మహిళా సంఘాల స్వయం ఉత్పత్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

బండ్లగూడ: చిరువ్యాపారాలను అభివృద్ధి చేసుకునే దిశగా ముందడుగు వేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కానూరి శ్రీనివాస్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యుల స్వయం ఉత్పత్తుల ప్రదర్శన, స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ... వీధి విక్రయదారులు చిరు వ్యాపారులు అభివృద్ధి పరుచుకునే దిశగా ముందడుగు వేయాలని, ఆర్థిక పరిపుష్టి, వారి కుటుంబ పోషణ మెరుగుపర్చుకోవాలని సూచించారు. వారికి కావాల్సిన ఆర్థిక సాయం ప్రభుత్వం ద్వారా, బ్యాంకుల ద్వారా అందించే విధంగా వీధి విక్రయదారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉత్పత్తులు, వివిధ తినుబండారాల ప్రదర్శనను పరిశీలించి, ఆరోగ్యమైన ఆర్గానిక్ ఫుడ్ తయారు చేయాలని తెలిపారు. కమిషనర్ బి.శరత్‌చంద్ర, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్వో కె.శివకుమార్, టీపీఎస్ జి.రాకేష్, టీఎంజీ ఎస్.శ్రీలత, మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాంరెడ్డి



డి.రాంరెడ్డి

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని నర్కూడ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్ మాస్టర్ డి.రాంరెడ్డి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుకు ఎంపికయ్యారు. విధి నిర్వహణలో ఎలాంటి రిమార్కులు లేకుండా పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచుతూ ఉత్తమ ఫలితాలు సాధించారు. 28 జులై 1988లో స్పెషల్ టీచరుగా నియామకమైన ఆయన 1989లో సెకండ్ గ్రేడ్ టీచరుగా, 1992లో స్కూల్ అసిస్టెంట్‌గా 2009లో హెచ్ఎంగా ప్రమోషన్లు పొందారు. మండలంలోని పాల్మాకులలో హెచ్ఎంగా బాధ్యతలు తీసుకున్న ఆయన 2014లో నర్కూడ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సమయంలో 2015 నుంచి 2024 వరకు ఇంచార్జి ఎంఈఓగా విధులు నిర్వహించారు. అంతేకాకుండా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఉన్న శంషాబాద్, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల ఇంచార్జి ఎంఈఓగా 2018 నుంచి 2024 వరకు పని చేశారు. ప్రస్తుతం నర్కూడ జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి...

దాతల సాయంతో మూడు మండలాల్లో 57 అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేశారు. మరుగుదొడ్ల ఏర్పాటు, పాఠశాల భవనాలకు దాతల ద్వారా రంగులు వేయించారు. ప్రభుత్వం నుంచి నిధులు వెచ్చించకుండానే శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను కూల్చివేయించారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేయించారు. అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'కి తెలిపారు.

భావిపౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన ఎంఈవో కేశవత్ శంకర్‌రాథోడ్ తదితరులు

అత్తాపూర్: మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల విద్యాధికారి కేశవత్ శంకర్‌రాథోడ్ ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి ఆయన నివాసంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం ఇక నుంచి పాఠశాలలోనే తీసుకునేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు వేసవి సెలవుల్లో శిక్షణ పొందిన ఫిజికల్ డైరెక్టర్‌లతో శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. ఈ నెల 10న జరిగే ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. రాజేంద్రనగర్ మండల పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడు సుదర్శన్, వెంకటయ్య, ఎస్‌టీయూ జనార్ధన్‌చారి, ఎస్‌టీఎఫ్ బాలకృష్ణ, టీపీయూఎస్ ఆంజనేయులు, మహేశ్వర్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాన్ని పరిశీలించిన సైబరాబాద్ సీపీ



నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న సీపీ మహంతి, ఉత్సవ సమితి ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో గురువారం 9వ రోజు గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లలో నెలకొల్పిన గణనాథులను మండపాల నిర్వాహకులు పూజా కార్యక్రమాల అనంతరం ఊరేగింపుగా పత్తికుంట, పల్లెచెరువులకు తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూల వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. వేల నుంచి లక్షల రూపాయల వరకు లడ్డూల ధరలు పలికాయి. పత్తికుంట వద్ద జరుగుతున్న నిమజ్జన కార్యక్రమాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మహంతి పరిశీలించారు. పత్తికుంట వద్ద గణనాథుల రద్దీ అధికంగా ఉండటంతో నాలుగు క్రేన్లను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన గణనాథులు మధ్యాహ్నం నుంచి పత్తికుంటకు క్యూ కట్టాయి. కిస్మత్‌పూర్ మూసీ వాగు వద్ద ఒక క్రేన్‌ను ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న గణనాథులను నిమజ్జనం చేశారు. పల్లెచెరువు వద్ద మరో క్రేన్‌ను ఏర్పాటు చేసి గణనాథులను నిమజ్జనం చేశారు. 9వ రోజు భారీగా గణనాథులు తరలిరావడంతో ఎక్కడ చూసినా భక్తులే కనిపించారు.

మూడు విమానాల రద్దు

శంషాబాద్: సాంకేతిక కారణాలతో ఒకే రోజు మూడు వేర్వేరు విమానాలు రద్దయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి... హైదరాబాద్ నుంచి తిరుపతి స్పైస్ జెట్ విమానం 2138, హైదరాబాద్ నుంచి శివమొగ్గకు బయలుదేరాల్సిన ఎస్‌జీ2703 విమానాలు సాంకేతిక సమస్యతో రద్దయ్యాయి. దీంతో పాటు దోహా నుంచి హైదరాబాద్ రావల్సిన క్యూఆర్ 936 విమానం కూడా సాంకేతిక కారణాలతో రద్దు చేశారు. దీంతో సంబంధిత విమానాల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా విమానాల ప్రయాణికులకు టికెట్ రీ షెడ్యూల్‌తో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

రేపు అనంత పద్మనాభస్వామి వ్రతం

మణికొండ: పుప్పాలగూడలో అతిపురాతనమైన అనంత పద్మనాభస్వామి దేవాలయం వద్ద శనివారం అనంత చతుర్థిని పురస్కరించుకొని అనంత కోటి ఒత్తుల పూజ, అనంత చతుర్దశి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పూజలు ప్రారంభం అవుతాయన్నారు. తనంతరం తీర్థగోష్ఠి, అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

మాజీ సర్పంచ్ వెంకటేష్ సేవలు చిరస్మరణీయం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మాజీ సర్పంచ్ దివంగత వెంకటేష్ జయంతిని గురువారం ఘనంగా జరిగాయి. ఆయన సతీమణి మాజీ కార్పొరేటర్ అనిత వెంకటేష్ ఆధ్వర్యంలో ఇందిరారెడ్డినగర్ మెయిన్‌రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. స్థానికంగా ఆయన చేసిన అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో ఆయన చొరవ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నేతలు బొర్ర గోపాల్ ముదిరాజ్, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. నిమజ్జనాలు

వైభవంగా గణేశ్ నవరాత్రి సంబరాలు

వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా గణనాథులకు ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బొజ్జ గణపయ్యకు నిత్యం అర్చనలు, హోమాలు, అలంకరణలు నిర్వహిస్తున్నారు. నవరాత్రులు ముగుస్తుండటంతో పలు మండపాలలో పెద్ద ఎత్తున అన్నదానాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం పలు మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పిల్లలు, పెద్దలు వాటిల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు, చౌరస్తాలు వినాయక నవరాత్రి ఉత్సవాలతో సందడిగా మారాయి. పలు వినాయకులను గురువారం నిమజ్జనాలకు తరించారు.

– రాజేంద్రనగర్



మణికొండ భాగ్యలక్ష్మి కాలనీలో మాజీ వైస్ చైర్మన్



పుప్పాలగూడలో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న కురుమ సంఘం నేతలు



నెక్నాంపూర్ వెంకటేశ్వరకాలనీలో మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్



నార్సింగి ఆక్యురేట్ విండ్ చెమ్మీస్ గేటెడ్ కమ్యూనిటీలో...



మణికొండ శివాజీనగర్ కాలనీలో...



పుప్పాలగూడ తిరుమలహిల్స్‌లో...



నార్సింగిలో...



మణికొండ పంచవటి కాలనీలో మాజీ మహిళా కౌన్సిలర్‌లు, మహిళలు



నార్సింగి వివేకానంద కాలనీలో కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్



హైదర్‌గూడ జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ అన్నదానం



అత్తాపూర్‌లో పూజల్లో పాల్గొన్న యువకులు



ఆప్కో కాలనీలో బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి-2 అధ్యక్షుడు వినయ్‌రెడ్డి తదితరులు



పీరంచెరువు వద్ద నిమజ్జనాలను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర



కాటేదాన్‌లో లడ్డూను రూ. 2.25 లక్షలకు దక్కించుకున్న జయప్రకాష్



మార్కండేయనగర్‌లో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తదితరులు



హైదర్షాకోట్‌లో మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి తదితరులు



కిస్మత్‌పూర్‌లో గోకరి సురేష్‌గౌడ్ తదితరులు



పల్లెచెరువు వద్ద ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నరేందర్